
సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500,పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.



పోలీసు వలయంలో అమలాపురం

అమలాపురంలో రౌడీషీటర్ హత్య, అతడి స్నేహితుడిపై హత్యాయత్నం, తదనంతరం జరిగిన ఆస్తుల ధ్వంసం పరిణామాలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. - 8లో ▸

శనైశ్చరునికి పూజలు, తైలాభిషేకాలు

కొత్తపేట: శని దోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి క్షేత్రంలో శ్రీ ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ రూపాల్లో టిక్కెట్ల ద్వారా రూ.81,817, అన్నప్రసాదం విరాళాలుగా రూ.10,991 చొప్పున ఆదాయం సమకూరిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 14.1 మి.మీ. సగటు వర్షపాతం

కొవ్వూరు: జిల్లాలో శనివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు (గడిచిన 24 గంటల వ్యవధిలో) సరాసరి 14.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరంలో భారీగా వర్షం కురిసింది. రికార్డు స్థాయిలో 107.4 మిల్లీమీటర్ల మేర వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇంత వర్షం కురవడం ఇదే ప్రథమం. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షపునీరు నిలిచి పోయింది. కడియంలో 20.8, కోరుకొండలో 12.2, గోకవరంలో 3.4, రాజమహేంద్రవరం రూరల్‌లో 17.6, రాజానగరంలో 14.0 ,బిక్కవోలులో 1.8, తాళ్లపూడిలో 2.0, గోపాలపురంలో 3.2, కొవ్వూరులో 34.8, చాగల్లులో 48.4,నిడదవోలులో 2.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. కొవ్వూరులో శనివారం తెల్లవారు జామున వర్షం పడింది.

రేపటి నుంచి పాఠశాల స్థాయి క్రీడా పోటీలు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల స్థాయి క్రీడా పోటీల ఎంపిక ప్రక్రియను సోమవారం ప్రారంభిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులన్నారు. తొలుత మండల స్థాయి, తర్వాత నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి, జిల్లా స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేస్తామని అబ్రహం వివరించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

కడియం: ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం కడియపులంకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం లాభం గ్రామానికి చెందిన అంపోలు గురుమూర్తి (40) కుటుంబం ప్రస్తుతం కడియపులంక చర్చి వీధిలో నివసిస్తుంది. శనివారం ఉదయం గురుమూర్తి హైవే పక్కన కాలువ గట్టుకు మల విసర్జన నిమిత్తం వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా రావులపాలెం నుంచి వేమగిరి వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గురుమూర్తికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు కల్యాణ్ ఫిర్యాదు మేరకు కడియం ఎస్సై బాలాజీ కేసు నమోదు చేశారు.

రత్నగిరిపై మోగిన పెళ్లి బాజా

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన పెళ్లిబృందాలు, భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో సుమారు వంద వివాహాలు జరిగాయి. ఈ వివాహాలు చేసుకున్న నవ దంపతులు, బంధుమిత్రులతో పాటు ఇతర ప్రాంతాల్లో పెళ్లి చేసుకున్న జంటలు కూడా సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సత్యదేవుని దర్శనానికి సాధారణ భక్తులూ ఎక్కువ సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు నిండిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నవదంపతులతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సందడి నెలకొంది. సత్యదేవుని ఆలయాన్ని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించారని అధికారులు తెలిపారు. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు, రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి జ్యోతుల వెలిగించారు. నవదంపతులు స్వామివారి దర్శనం అనంతరం తమ పెళ్లిదండలను రావి చెట్టు వద్ద గల గ్రిల్స్‌కు వేలాడదీశారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దేవస్థానంలో పర్యటించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆది, సోమవారాలలో కూడా రత్నగిరిపై వివాహాలు పెద్ద సంఖ్యలో జరిగే అవకాశం ఉంది. దేవస్థానంలో రద్దీ నెలకొనే అవకాశం ఉంది. దేవస్థానం సత్రాల గదులలో అధిక శాతం వివాహ బృందాల వారు రిజర్వ్ చేసుకున్నారు.





కోరుకొండ మండలం బుచ్చెంపేటలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

సంక్షేమ సంతకం వైఎస్సార్

- జిల్లా వ్యాప్తంగా దివంగత నేతకు ఘన నివాళులు
- సేవా కార్యక్రమాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు
- పేదలకు పండ్లు, దుస్తుల పంపిణీ

సాక్షి, రాజమహేంద్రవరం: సంక్షేమ దార్శనికుడిగా.. ఆరోగ్య ప్రదాతగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని సంతకంగా నిలిచిపోయారని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు, అభిమానులు శ్లాఘించారు. మహానేత వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేసిన మహా నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఎన్నో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రజలందరి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణం ఎంపీ కార్యాలయంలో మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిర్వహించారు. వైఎస్సార్ చిత్ర పటానికి, వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ మార్గాని భరత్‌రామ్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రజల సంక్షేమానికి వైఎస్సార్ పది అడుగులు వేస్తే..తండ్రికి మించిన తనయుడిగా సీఎం జగన్ వంద అడుగులు ముందుకు వేస్తున్నారని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి అర్బన్ కో–ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

రాజానగరం: ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. బుచ్చెంపేటలో వైఎస్ చిత్రపటం, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కోరుకొండలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. రోగులకు సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కొవ్వూరు: హోం మంత్రి తానేటి వనిత క్యాంప్ కార్యాలయం, మెయిన్ రోడ్డులో హోం మంత్రి వనిత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన అంజలి ఘటించారు. ప్రజలకు ఆయన చేసిన మంచిని స్మరించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాసుల నాయుడు ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. వైఎస్సార్ కాలనీలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

గోపాలపురం: ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా సేవాకార్యక్రమాలు చేపట్టారు. గోపాలపురం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నల్లజర్లలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దుస్తులు పంపిణీ చేశారు. దేవరపల్లిలో బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు.

రాజమండ్రి సిటీ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో: రాజమండ్రి సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ కార్యాలయంలో ఎంపీ భరత్‌తో కలిసి మహానేతకు ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు.

రాజమండ్రి రూరల్: వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మహానేతకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వీల్‌చైర్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. కడియపులంలో దివంగత నేతకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు నివాళులు అర్పించారు.



కొవ్వూరులోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, నాయకులు

దరఖాస్తులకు 15 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఉత్తర్వుల మేరకు జిల్లాలో 2023– 24లో జరుగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగింపు ఉండదన్నారు. జిల్లాలోని పాఠశాల హెచ్‌ఎంలంతా తమ పరిధిలో ఆసక్తి గల విద్యార్థులు ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ పరీక్షలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, లేదా ప్రభుత్వ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.గవ్.ఇన్.లో చూడవచ్చన్నారు.

మలేరియా జ్వరాలపై అశ్రద్ధ చేస్తే చర్యలు

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ వి.రామిరెడ్డి



వైద్యాధికారితో మాట్లాడుతున్న రామిరెడ్డి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మలేరియా జ్వరాలు పంజా విసురుతున్న నేపథ్యంలో బాధితులకు వెంటనే మెరుగైన వైద్య చికిత్స అందించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ వి.రామిరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని జోన్–2 మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. రీజినల్ డైరెక్టర్ పద్మాశశిధర్‌తో సుమారు గంటకు పైగా చర్చించారు. ఇటీవల జోన్–2 పరిధిలో జరిగిన 143 మంది రీ డిప్లమెంట్ (సిబ్బంది సర్దుబాటు) కౌన్సెలింగ్ ప్రక్రియపై ఆరా తీశారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగారు. అంతా సవ్యంగా ఉన్నట్లు ఆమె బదులిచ్చారు. అనంతరం మలేరియా జ్వరాల విజృంభనపై నివేదిక తీసుకున్నారు. ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరంలో మలేరియా బాధితులు అధికంగా ఉండడంతో ఆర్డీతో కలిసి ఆయన ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఆ ప్రాంతంలోని మలేరియా బాధితులను, వారికి అందుతున్న వైద్య సహాయాన్ని పర్యవేక్షిస్తారు.

ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సులు

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- 19 మందికి స్వల్ప గాయాలు
- మోటార్ సైక్లిస్టుకు తప్పిన ముప్పు
- బస్సు కింద పడి ప్రాణాలతో బయటపడిన వాహనదారుడు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామ శివారున రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 26 మంది గాయపడ్డారు. వివరాలివీ.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి రాజమహేంద్రవరం వస్తున్న పల్లె వెలుగు బస్సును.. కొవ్వూరు నుంచి ఏలూరు వెళ్తు మరో పల్లె వెలుగు బస్సు ఢీకొంది. లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో రెండు బస్సుల ముందు భాగాలూ దెబ్బ తిన్నాయి. ప్రమాదానికి గురైన రెండు బస్సులూ కొవ్వూరు డిపోకు చెందినవే. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన 18 మందికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఇళ్లకు పంపించారు. మరో ముగ్గురికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో కేవీ సాగర్ (కొవ్వూరు), వి.మంగయమ్మ, ఎం.శేషారెడ్డి (ఏలూరు), రాజయ్య (దేవరపల్లి మండలం యాదవోలు), సీహెచ్ రామకృష్ణ (బంగారమ్మపేట), తుపాకుల దుర్గారావు (చింతూరు) తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో లారీ ముందు వెళ్తున్న మోటార్ సైక్లిస్టు బస్సు ముందు చక్రంలో పడిపోయారు. అయితే, అదృష్టవశాత్తూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆయన మోటార్ సైకిల్ నుజ్జునుజ్జయ్యింది. హైవే పెట్రోలింగ్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధర్ ఆధ్వర్యాన క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించారు. కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకుని, క్షతగాత్రులను పరామర్శించారు. క్షతగాత్రులకు తక్షణ వైద్య సేవలందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నగ్గులపాటి శ్రీనివాస్, వరిగేటి సుధాకర్ సహకరించారు. సూపరింటెండెంట్ సాయికిరణ్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని వైద్య సేవలను పర్యవేక్షించారు. పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ క్షతగాత్రులతో మాట్లాడి, ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : మంత్రి వనిత



ఈ ప్రమాదంపై రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత స్పందించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ, పోలీసులు అధికారులను ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టమూ లేకపోయినప్పటికీ 26 మంది గాయపడటం దురదృష్టకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.



కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు



బస్సు కింద పడిన మోటార్ సైకిల్

కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హెచ్చరిక



అనంతపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: మండలంలో శుక్రవారం నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా వివిధ గ్రామాలలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ చేసిన దాడులపై ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి హింసాత్మక చర్యలను చూస్తూ ఊరుకోబోమన్నారు. దీనికి టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రలు చాలా చూశామన్నారు. కానీ లోకేష్, పాదయాత్ర అర్థాన్నే మార్చేలా చేస్తున్నారన్నారు. మండలంలో పాదయాత్ర ఎందుకు జరుగుతుందో తెలియకుండా ఉందన్నారు. మార్గమధ్యంలో ఏవర్గాల ప్రజలను కలుసుకుని కష్టసుఖాలు అడిగిన సందర్భం లేదన్నారు. తిమ్మన్నపాలెంలో ఆరునెలల కిందటే సీఎం ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే పాదయాత్ర సందర్భంగానే ఏర్పాటు చేశారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఫ్లెక్సీ చించేయమని చెప్పడం చిన్నపిల్లల చేష్టలా ఉందన్నారు. రికార్డుకోసం పాదయాత్ర చేస్తున్నట్టుగా ఉందన్నారు. జగన్ పాదయాత్రకు, లోకేష్ పాదయాత్రకూ పోల్చితే నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. తమ కార్యకర్తలు శాంతియుతంగా ఉంటే టీడీపీ దుందుడుకు చర్యలతో రెచ్చగొడుతోందన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునేలా పోలీసు కేసులు పెట్టారన్నారు. గాయపడిన కార్యకర్తలను ఆయన పరామర్శించారు.

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యం

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనకబుల్ డిసీజ్) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్యాన్సర్ ముందస్తు లక్షణాలు, వాటి నివారణలో భాగంగా ప్రైవేట్ ఆస్పత్రుల సహకారంతో నిర్వహిస్తున్న మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ అంశాలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించడానికి ప్రైవేట్ హాస్పిటల్స్ సహకారంతో జిల్లాలోని వివిధ గ్రామాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మనిషిలో కొన్ని లక్షణాలను ముందుగా గుర్తించి ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా వ్యాధిని గుర్తించవచ్చన్నారు. తద్వారా వెంటనే చికిత్స చేయించుకుంటే క్యాన్సర్‌ను తగ్గించవచ్చన్నారు. జిల్లా సర్వైలెన్స్ ఆఫీసర్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ జిల్లాలో సెప్టెంబర్‌లో 9 క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 4న అనపర్తి మండలం పొలమూరు, 6న దేవరపల్లి మండలం దేవరపల్లి, 8న కోరుకొండ మండలం గాదరాడ, 12న కొవ్వూరు మండలం వేములూరు, 15న నల్లజర్ల మండలం జగన్నాథపురం, 23న నిడదవోలు మండలం సమిశ్రగూడెం, 20న తాళ్లపూడి మండలం పోచవరం, 26న గోపాలపురం మండలం తండపూడి కార్తికేయ ఫంక్షన్ హాల్‌లో, 29న ఉండ్రాజవరం మండలం మోర్తలో శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ శిబిరాలను డెల్టా, ఎసెంట్, జీఎస్ఎల్ హాస్పిటల్స్ వారు నిర్వహించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

క్లుప్తంగా

'నన్నయ'కు 125 అధ్యాపక పోస్టుల మంజూరు


ఆచార్య పద్మరాజు

రాజానగరం: వివిధ బోధన విభాగాల్లో ఉన్న ఖాళీల భర్తీ ప్రక్రియలో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీకి 125 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయి. ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

తొలుత 128 పోస్టులకు అనుమతి ఇవ్వగా, వివిధ కారణాలతో మూడు పోస్టులు నిలుపు చేశారన్నారు. వర్సిటీలో ఇప్పటికే వివిధ కేటగిరీల్లో 26 పోస్టులుండగా, మరో 99 మందిని నియమించేందుకు అవకాశం లభించిందన్నారు. వీటిలో 77 అసిస్టెంట్ ప్రొఫెసర్, 33 అసోసియేట్ ప్రొఫెసర్, 18 ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయని వివరించారు. మంజూరైన పోస్టుల్లో నవంబరు 14లోగా నియామకాలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయితే బోధన, పరిశోధనల్లో నాణ్యత మరింత పెరుగుతుందని ఆచార్య పద్మరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.


ఆలయంలో భక్తుల కోలాహలం

కిటకిటలాడిన వాడపల్లి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు తరలివచ్చి, స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో గోవిందనామ స్మరణ ప్రతిధ్వనించింది. స్వామి వారిని వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, విరాళాల ద్వారా స్వామి వారికి రూ.30,52,534 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయం వద్ద ట్రాఫిక్ పెరగడంతో ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆటో డ్రైవర్ నిజాయితీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆటోలో ప్రయాణికుడు మరచిపోయిన వెండి ఆభరణాల బ్యాగ్‌ను పోలీసులకు అప్పజెప్పి, తన నిజాయితీ చాటుకున్నాడు ఆ డ్రైవర్. టూ టౌన్ సీఐ టి.గణేష్ కథనం ప్రకారం.. ధవళేశ్వరానికి చెందిన బూర నూకారెడ్డి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అతడి ఆటోలో అమలాపురానికి చెందిన వూటుకూరి మోహన సూరిబాబు అనే వ్యక్తి ఎక్కాడు. అతడు రైల్వే స్టేషన్ వద్ద కంగారుగా దిగిపోయాడు. కొద్దిసేపటి తరువాత ఆటో డ్రైవర్ నూకారెడ్డి ఆటోలో గమనించగా సీటులో బ్యాగ్ కనిపించింది. అందులో వెండి వస్తువులు ఉన్నాయని గమనించాడు. వెంటనే ఆ బ్యాగ్‌ను విఘ్నేశ్వర ఆటో యూనియన్ ద్వారా సీఐ గణేష్‌కు అందజేశారు. అందులో రెండు వెండి గాజులు, వెండి బ్రాస్‌లెట్, వెండి సాయిబాబా బొమ్మ, వెండి వినాయక విగ్రహం ఉన్నాయని సీఐ గుర్తించారు. విచారణ అనంతరం బాధితులను గుర్తించి, ఆ బ్యాగ్‌ను అప్పగించారు. నిజాయితీతో బ్యాగ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించిన ఆటో డ్రైవర్ నూకారెడ్డిని డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ గణేష్, పోలీసు అధికారులు అభినందించారు.


పోలీసుల సమక్షంలో బ్యాగ్‌ను బాధితునికి అందజేస్తున్న ఆటో డ్రైవర్ నూకారెడ్డి

పోలీసు వలయంలో అమలాపురం

- రౌడీషీటర్ హత్య, తదనంతర పరిణామాలతో అప్రమత్తం
- 15 చోట్ల పికెట్లు
- డీఐజీ, ఇద్దరు ఎస్పీలతో శాంతిభద్రతల పరిరక్షణ
- నిందితుల వేటలో పోలీసు ప్రత్యేక బృందాలు


అమలాపురం పట్టణంలో మోహరించిన పోలీసులు

అమలాపురం టౌన్: రౌడీషీటర్ పోలిశెట్టి కిషోర్ హత్య, అతడి స్నేహితుడు అడపా సాయి లక్ష్మణ్‌పై హత్యాయత్నం, తదనంతరం జరిగిన ఆస్తుల ధ్వంసం పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా శుక్రవారం అర్ధరాత్రి నుంచే భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణంతో పాటు ఈదరపల్లి ప్రాంతాలు శనివారం పూర్తిగా పోలీసు వలయంలోకి వెళ్లాయి. అడుగడుగునా పోలీసు పహరాలు, పికెట్లు ఏర్పాటు చేశారు. దాదాపు 400 మంది పోలీసులను మోహరించారు. అమలాపురంలోని టీడీపీ నాయకుడు, మాజీ రౌడీషీటర్ గంధం పల్లంరాజు ఇంటి వద్ద, అతడి షాపు ఉన్న సప్తగిరి అపార్ట్‌మెంట్, కొంకాపల్లిలోని రౌడీషీటర్ ఆనంద్ ఇంటి వద్ద, అల్లవరం మండలం గూడాలలోని సుధీర్ ఇంటి వద్ద, ఈదరపల్లిలోని ఇద్దరి రౌడీ గ్యాంగ్ ఇళ్ల వద్ద, అమలాపురంలోని ముఖ్య కూడళ్లు కలిపి మొత్తం 15 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. అమలాపురంలో అల్లర్లకు అర్ధరాత్రి నుంచే పోలీసులు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్, కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్ విజయారావు ఆధ్వర్యాన పోలీసు పహారా కొనసాగుతోంది. రౌడీ షీటర్ల ఆగడాలు, శాంతిభద్రతల పరిస్థితిపై పోలీసు ఉన్నతాధికారులు ఎస్పీ కార్యాలయంలో శనివారం పలుమార్లు సమీక్షించారు. ఇక నుంచి రౌడీషీటర్లపై మరింతగా ఉక్కుపాదం మోపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీధర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పోలీసు బందోబస్తుకు పలు సూచనలు ఇచ్చారు. కిషోర్‌ను హత్య చేయడంతో పాటు సాయిలక్ష్మణ్‌పై హత్యాయత్నానికి పాల్పడి, పరారైన రౌడీ గ్యాంగ్ కోసం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యాన రెండు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఇప్పటికే కొంతమంది అనుమానితులను, రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

రౌడీషీటర్లను ఉపేక్షించేది లేదు

జిల్లా ఎస్పీ శ్రీధర్



రౌడీషీటర్లను ఉపేక్షించేది లేదని, వారి కదలికలపై ఇక నుంచి నిరంతర నిఘా పెడతామని, మరింతగా ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఈదరపల్లిలో రౌడీషీటర్ హత్య, అతడి స్నేహితుడిపై హత్యాయత్నం కేసులను లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. రౌడీషీటర్ల మూలాల్లోకి వెళ్లి విచారిస్తున్నామని చెప్పారు. ఈ హత్య, తదితర పరిణామలపై సోషల్ మీడియా ద్వారా ఎవరైనా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రత పరిరక్షణకు అందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో నిందితులందరినీ త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ శ్రీధర్ చెప్పారు.

హరిత సీమలో ఎడారి ఓడలు

కనుచూపు మేరంతా ఇసుక తిన్నెలు పరచుకుని ఉండే ఎడారిలో ప్రయాణాలకు ఒంటెలు ఉపయోగపడుతూంటాయి. అందుకే వీటిని ఎడారి ఓడలని అంటూంటారు. అయితే, వీటిని కొంత మంది బతుకుతెరువు కోసం ఉపయోగించుకుంటూ.. పొట్ట చేత పట్టుకుని వివిధ ప్రాంతాల్లో సంచార జీవనం గడుపుతున్నారు. ఇదే క్రమంలో ఈ ఎడారి ఓడలు.. కనుచూపు మేరంతా ఆకుపచ్చదనం పరచుకున్న మన కోనసీమలో దర్శనమిస్తున్నాయి. నెల్లూరుకు చెందిన కొందరు మహిళలు రెండు ఒంటెలతో శనివారం సఖినేటిపల్లి వద్ద గోదావరి నది దాటి ఈ హరిత సీమకు చేరుకున్నారు. ఆ ఒంటెలతో ఇంటింటికీ తిరిగి పొట్ట నింపుకొంటున్నారు. కొందరు చిన్నారులు ఆ ఒంటె పైకి ఎక్కి.. సరదాగా ఊరేగుతూ.. ఆ మహిళలకు డబ్బులు ఇస్తున్నారు.

– మలికిపురం



జేఎన్‌టీయూకే పాలక మండలి నియామకం

- సభ్యులను నియమించిన ప్రభుత్వం
- మూడేళ్ల పాటు కొనసాగింపు
- ఐదుగురు మహిళలకు అవకాశం



జేఎన్‌టీయూ-కాకినాడ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాలపరిమితి ముగిసిన యూనివర్సిటీలకు పాలక మండలి సభ్యులను నియమిస్తూ ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూకే పాలక మండలిని మూడేళ్ల కాలపరిమితితో 2020 మార్చిలో ఏర్పాటు చేయగా దాని గడువు గత మార్చితో ముగిసింది. అనంతరం రెండు నెలలు పొడిగించారు. తాజాగా సెప్టెంబర్ 1 నుంచి మూడేళ్ల కాలపరిమితితో కొత్త పాలక మండలి సభ్యులను నియమించారు. వీరిలో వర్సిటీ నుంచి వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, ఇద్దరు ప్రొఫెసర్లు ఉన్నారు. వీరితో పాటు రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఆర్థిక కార్యదర్శి, సాంకేతిక కమిషనర్ కూడా ఉండగా, మిగిలిన సభ్యులుగా విద్య, వ్యాపారం తదితర రంగాల్లో నిష్ణాతులైన వారిని నియమించారు. వర్సిటీ అభివృద్ధితో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఎనిమిది జిల్లాల్లోని ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రగతికి సంబంధించి ఈ పాలక మండలి నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ నెల నాలుగో వారంలో నూతన పాలక మండలి తొలి సమావేశం ఏర్పాటు చేసి, వివిధ అంశాలపై సమీక్షిస్తామని జేఎన్‌టీయూకే ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు.

కొత్త పాలకవర్గ సభ్యులు వీరే..

వర్సిటీ తరఫున చైర్మన్ హోదాలో వీసీ ప్రసాదరాజు వ్యవహరిస్తారు. సభ్యులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, సీనియర్ ప్రొఫెసర్ కోటాలో యూవీ రత్నకుమారి (ఈసీఈ), డాక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ (జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్), ప్రొఫెసర్ హరిత (సీఎస్ఈ ప్రొఫెసర్), డాక్టర్ ఎస్‌కే అమినాబీ (వీవీ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్, గుడ్లవల్లేరు కళాశాల, కృష్ణా జిల్లా), నిష్ణాతుల కోటాలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ, రిలయన్స్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ బి.మల్లికార్జునరావు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, కిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌లను నియమించారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

కాకినాడ క్రైం: సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ బోటు నుంచి జారి పడి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ పర్లోవపేటకు చెందిన చింతపల్లి రాజు (49) గత నెల 29న తన బోటులో కుమారుడు సింహాద్రితో పాటు మరో మత్స్యకారుడు ఎల్లాజీతో కలిసి కుంభాభిషేకం రేవు నుంచి వేటకు వెళ్లాడు. ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో హోప్ ఐలాండ్ వద్ద చేపలు వేటాడుతున్నారు. ఈ క్రమంలో రాజు ప్రమాదవశాత్తూ బోటు నుంచి జారి సముద్రంలో పడిపోయాడు. అప్పటికే చేపల వేట కోసం వేసిన వలలో చిక్కుకున్నాడు. ప్రాణ రక్షణ కోసం కేకలు వేయడంతో గమనించిన తోటి మత్స్యకారులు వలను బోటు పైకి లాగి, రాజును రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే అచేతన స్థితిలో ఉన్న రాజును సింహాద్రి, ఎల్లాజీ కలిసి, కుంభాభిషేకం తీరానికి తీసుకువచ్చారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని, పరీక్షించగా రాజు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య నూకరత్నం ఫిర్యాదు మేరకు కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.


కారు ఢీకొని మృతి చెందిన గొర్రెలు

కారు ఢీకొని 20 గొర్రెల మృతి

గోపాలపురం: కారు ఢీకొని 25 గొర్రెలు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. గోపాలపురం గ్రామానికి చెందిన గంధం శ్రీను తన గొర్రెల మందను గొల్లగూడెం నుంచి గోపాలపురం తోలుకు వస్తున్నాడు. గోపాలపురం పాగాకు బోర్డు సమీపానికి వచ్చేసరికి దేవరపల్లి నుంచి గోపాలపురం వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి మందను ఢీకొట్టింది. ఈ సంఘటనలో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 5 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. అవి కూడా చనిపోతాయని గంధం శ్రీను కన్నీటిపర్యంతమయ్యాడు. చనిపోయిన 20 గొర్రెల్లో 10 గొర్రెల గర్భంలో ఉన్న పిల్లలు కూడా చనిపోయాయి. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు చెప్పాడు. సంఘటన స్థలంలో లభ్యమైన నంబర్ ప్లేటు, బంపర్ ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై కె.శోభనాద్రి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాకినాడ క్రైం: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఎస్సై ఎస్.రవికుమార్ కథనం ప్రకారం.. కాకినాడ వైఎస్సార్ వంతెన కింద ఉన్న రైల్వే ట్రాక్‌పై శుక్రవారం అర్ధరాత్రి సుమారు 30 ఏళ్ల వ్యక్తిని రైలు ఢీకొంది. అతడి వివరాలు తెలియరాలేదు. 5.6 అడుగుల ఎత్తు, చామనఛాయలో ఉన్న ఆ వ్యక్తి మోచేయి ముందు భాగాన పుట్టుమచ్చ, ఎడమ భుజంపై సూర్యుడి పచ్చబొట్టు ఉన్నాయి. మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్ మార్చురీలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లోని జీఆర్‌పీని నేరుగా లేదా 94407 02328 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని ఎస్సై సూచించారు.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ లీగ్ పోటీలు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ లీగ్ పోటీలను స్థానిక గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీలో శనివారం నిర్వహించారు. పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. సీనియర్స్ విభాగంలో బి.జోషిత్, సిరి పావని, తాన్యశ్రీ, దర్శిక, జూనియర్స్ విభాగంలో టి.సాయి, డి.ప్రయర్ష, కె.నయన, కల్పజైన్ విజయం సాధించారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెడల్స్ అందజేశామని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీటీవీ సుబ్బారావు తెలిపారు. అధ్యక్షుడు, కోచ్ పి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.